నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 30 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా..

- ప్రభుత్వ పథకాల అమలే ప్రథమ ప్రాధాన్యం..
- ఎప్పటికప్పుడు రెవెన్యూ దరఖాస్తుల క్లియర్
- జిల్లాలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- 'సామాజిక' సర్వేపై పూర్తి స్థాయి నజర్
- కలెక్టర్ ఎం. హనుమంతరావు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పథకాల అమలు ప్రథమ ప్రాధాన్యమని కలెక్టర్ ఎం.హనుమంత రావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని, ప్రజావాణి దరఖాస్తులపై ఫోకస్ పెడుతామని తెలిపారు. జిల్లాలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. రెవెన్యూ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

'సామాజిక' సర్వేపై నజర్..

సామాజిక, విద్య, ఆర్థిక ఉద్యోగ, రాజకీయ, కుల అంశాల సర్వేపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ సర్వే 10 నుంచి 15 రోజుల పాటు ఉంటుందని, జిల్లాలో 200 మంది వరకు ఎన్యుమరేటర్లు సర్వేలో పాల్గొంటారని వివరించారు. జిల్లాలో ఇప్పటికే ఎన్యుమరేటర్లకు శిక్షణ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. 10 మందికి ఒక సూపర్‌వైజర్ ఉంటారని వెల్లడించారు. దీనికి నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గంగాధర్ వ్యవహరిస్తారని తెలిపారు.

ధాన్యాన్ని ఆరబెట్టి తేవాలి..

జిల్లాలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ చెప్పారు. ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. తేమ శాతం తక్కువగా ఉండేలా చూడాలన్నారు. దీని వల్ల ఎక్కువ సేపు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. రైస్ మిల్లర్ల సమస్య కూడా పరిష్కారం అయ్యిందని చెప్పారు.

ఉమ్మడి జిల్లా వాస్తవ్యుడినే..

''నేను ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తినే. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలు మా సొంతూరు. కాకినాడ పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేశాను. ఆ తర్వాత 2007లో ఆర్డీఓగా విధులు నిర్వర్తించాను. సిద్దిపేట, మహబూబ్‌నగర్, జగిత్యాలకు ఆర్డీఓగా కొనసాగాను. అనంతరం ఐఏఎస్‌గా పదోన్నతి లభించింది. సంగారెడ్డి కలెక్టర్‌గా తొలి పోస్టింగ్. సిద్దిపేటకు ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా సేవలు అందించా. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్, హార్టికల్చర్ కమిషనర్, దేవాదాయ డైరెక్టర్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌గా పనిచేసి.. ఇప్పుడు యాద్రాదికి బదిలీ అయ్యాను. యాదాద్రి జిల్లాకు కలెక్టర్‌గా రావడం ఆనందంగా ఉంది'' అని హనుమంత రావు చెప్పారు. .

బీబీనగర్ ఎయిమ్స్‌లో వర్చువల్ విధానం ద్వారా డ్రోన్ సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యం డ్రోన్ సేవలు

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

బీబీనగర్, అక్టోబర్ 29 : మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో డ్రోన్ సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. న్యూ ఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదంలో ధన్వంతరి జయంతితోపాటు 9వ ఆయుర్వేద దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రూ.12,850 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్‌ల వినియోగం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి భువనగిరి ప్రభుత్వ దవాఖానకు రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను తరలించి అతి తక్కువ సమయంలో పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షల అనంతరం రిపోర్టులను రోగులకు కావలసిన మందులను అందించనున్నారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు నిరంతరాయంగా ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించడంలో ఇది నిరంతర సంరక్షణగా గుర్తించబడిందన్నారు. బీబీనగర్‌లోని డ్రోన్ 3-8 కిలోల పేలోడ్ కెపాసిటీ., 30-60 కిలోమీటర్ల కవరేజీతో కూడిన చిన్న మానవరహిత వైమానిక వాహనం అని చెప్పారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా బీబీనగర్ మండలంలోని కొండమడుగు, బొమ్మలరామారం మండల కేంద్రం, భువనగిరి మండలంలోని బొల్లెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, డాక్టర్లు రాహుల్ నారంగ్, సంగీత సంపత్, నితిన్ జాన్, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా, డిప్యూటీ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ డా.బిపిన్ పి.వర్గీస్, ఐసీఎంఆర్ ప్రోగ్రాం ప్రతినిధులు సుమిత్ అగర్వాల్, డ్రోన్ యూనిట్ ఇన్‌చార్జి సైంటిస్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కుల్దీప్ నిగమ్, జిల్లా క్షయవ్యాధి అధికారి సాయి శోభ, డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని, విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్ : విజేతలకు బహుమతులు అందిస్తున్న బీసీ గురుకుల ఏజీఓ లింగయ్య

గురుకుల విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుడాలి

- బీసీ గురుకులాల ఏజీఓ లింగయ్య

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్ 29 : గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో ముం దుండాలని మహాత్మా జ్యోతిబాయి పూలే బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ లింగయ్య సూచించారు. మండలంలో శ్రీనివాసనగర్‌లో ఉన్న దామరచర్ల బీసీ గురుకుల పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఆర్‌సీఓ పద్మ, ప్రిన్సిపాల్ ఉమాదేవి, క్రీడా ఇన్‌చార్జి వి. రజిత, వివిధ పాఠశాలల పీడీలు, పా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజేతలు వీరే

అండర్-19 కబడ్డీలో విన్నర్‌గా అనంతగిరి గురుకుల పాఠశాల, రన్నర్స్‌గా కొండమల్లేపల్లి గురుకులం, ఖోఖోలో విన్నర్స్‌లో దామరచర్ల గురుకులం, రన్నర్స్‌గా మోటకొండూరు గురుకులం, వాలీబాల్‌లో విన్నర్స్‌గా అనంతగిరి గురుకులం, రన్నర్స్‌గా నల్లగొండ గురుకులం విద్యార్థులు నిలిచారు.

అండర్ -14 విభాగంలో

కబడ్డీలో విన్నర్స్‌గా నల్లగొండ గురుకులం, రన్నర్స్‌గా వలిగొండ గురుకులం, ఖోఖోలో విన్నర్స్‌గా మునుగోడు గురుకులం, రన్నర్స్‌గా నల్లగొండ గురుకులం, వాలీబాల్‌లో విన్నర్స్‌గా నల్లగొండ గురుకులం, రన్నర్స్‌గా వలిగొండ గురుకులం, చెస్‌లో విన్నర్స్‌గా తుమ్మడం గురుకులం, రన్నర్స్‌గా చందుపట్ల గురుకుల విద్యార్థులు నిలిచారు. 17 బహుమతులు గెలుచుకొని ఓవరాల్ చాంపియన్‌గా మునుగోడు గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. వ్యక్తిత చాంపియన్‌గా పి.వైష్ణవి నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా మనోహర్

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా డాక్టర్ ఎం. మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన యాదాద్రి జిల్లాలోనే ఏడీహెచ్ఓగా పనిచేస్తున్నారు. గతంలో ఇక్కడ డీఎంహెచ్ఓగా పనిచేసిన పాపారావు ఆగస్టులో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించలేదు. తాత్కాలికంగా ఇన్‌చార్జి డీఎంహెచ్ఓగా డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోదకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే కేవలం అడ్మిన్ బాధ్యతలు మాత్రమే ఆమె చూస్తుండగా, ఇతర ఏ ఫైల్ ముందుకు వెళ్లాలన్నా పాపారావు దగ్గరికి వెళ్లి అప్రూవల్ తీసుకోవాల్సి వస్తుండటంతో అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏమాయె..?

అధికారంలోకి వస్తే వంద రోజుల్లో చేస్తామని కాంగ్రెస్ హామీ

> '' రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు చేస్తాం. బీర్ల ఐలయ్య ఆలేరు రెవెన్యూ డివిజన్ గురించి చెప్పారు. తప్పకుండా సమస్యపై సానుకూలంగా పార్టీ స్పందిస్తుంది. అధికారంలోకి వచ్చాకసమస్యకు పరిష్కారం చూపిస్తుంది.'' ఇవీ గతేడాది నవంబర్ 24న ఆలేరులో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల సభలో అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు.

- పది నెలలు దాటినా పట్టించుకోని ప్రభుత్వం
- ప్రస్తుతం 'భువనగిరి'లో 12 మండలాలతో ఇబ్బందులు
- ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలనకు ఇక్కట్లు
- డివిజన్ అయితే ఎన్నో విధాలుగా మేలు
- సుమారు 25 ప్రభుత్వ కార్యాయాలు ఏర్పాటయ్యే అవకాశం
- పోరుబాట పడుతున్న అఖిల పక్ష సాధన కమిటీ

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ)/ఆలేరు టౌన్ : ఆలేరు రెవెన్యూ డివిజన్ కల కలగానే మారిపోతున్నది. ఇక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేరడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో డివిజన్ చేస్తామన్న ఎన్నికల హామీ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు దాటినా దాని ఊసేలేదు. రెవెన్యూ డివిజన్ అయితే ఎన్నో విధాలుగా ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదు. మరోవైపు ఆలేరు రెవెన్యూ డివిజన్ అఖిల పక్ష సాధన కమిటీ పోరుబాట పడుతున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ డివిజన్ చేయాలని పట్టుబడుతున్నది.

ఆలేరు నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. ఆలేరు, యాదగిరి గుట్ట, రాజాపేట, తుర్కపల్లి, మోటకొండూరు, ఆత్మకూరు (ఎం), గుండాలతో కలిపి 8 మండలాలు ఉన్నాయి. మొత్తం 72 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అయితే గతంలో యాదగిరిగుట్ట, రాజాపేట, గుండాల, ఆత్మకూర్‌తో కూడిన ఐదు మండలాలతో రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రతిపాదన వచ్చింది. అప్పటి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే వివిధ కారణాలతో అది ముందుకు కొనసాగలేదు. ఆలేరు పట్టణం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఉంది. ఆలేరులో రైల్వే స్టేషన్ కూడా ఉంది. ఆలేరు మండలంలోని కొలనుపాకలో ప్రసిద్ధి చెందిన సోమేశ్వరాలయం, జైన దేవాలయాలు ఉన్నాయి. రాజధానికి సమీపంలో ఉండటంతో పాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ ఆలయం ఈ నియోజకవర్గంలోనే ఉంది. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఇవన్నీ కలిసొచ్చే అంశాలుగా చెప్పవచ్చు.

వంద రోజులనే.. పది నెలలు దాటె..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశం ప్రచారస్త్రంగా మారింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆలేరు డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నామినేషన్ సందర్భంగా జరిగిన సభలో ఇదే విషయాన్ని అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రధానంగా ప్రస్తావించారు. ఐలయ్య సైతం ప్రచారంలో కీలకంగా ప్రస్తావించారు. ఇక మాసాయిపేటలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి సైతం హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు హామీ అమలు దిశగా అడుగులు ముందుకు పడలేదు.

పోరుబాటలో సాధన కమిటీ..

ఆలేరు రెవెన్యూ డివిజన్ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆలేరు రెవెన్యూ డివిజన్ అఖిల పక్ష సాధన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో పోరు చేస్తున్నారు. ఇప్పటికే ఆందోళనలు, నిరసనలు, వినతిపత్రాల కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందించారు. అసెంబ్లీలో ఐలయ్యకు మెమోరాండం ఇచ్చారు.

ఇప్పుడెన్నో ఇబ్బందులు..

భువనగిరి డివిజన్‌లో 12 మండలాలు ఉండడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. కింది నుంచి పై దాకా అధికారులకు పని భారం పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ భూసేకరణ, వైటీడీఏ పనులతో అసౌకర్యంగా ఉంది. నిత్యం వీవీఐపీలతో రద్దీగా ఉండే యాదగిరిగుట్టలో ప్రొటోకాల్ కోసం సమయం కేటాయించాల్సి వస్తున్నది. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నది. పరిపాలన సులభతరంగా లేదు. ప్రజలకు వ్యయ, దూర భారం పెరుగుతున్నది.

'డివిజన్'తో ఎన్నో విధాలుగా మేలు

ఆలేరు ప్రాంతంలో డివిజన్ ఏర్పాటు కోసం కావలసినంత భూమి 1026 సర్వేలో ఉంది. సుమారు 25 కార్యాలయాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది. వివిధ కార్యాలయాల కోసం ఇండోర్ స్టేడియం, లయన్స్ క్లబ్, ఎస్‌టీ హాస్టల్ అనువుగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. డివిజన్‌తో పరిపాలన కేంద్రీకృతమై ఉంటుంది. సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తుదారులకు వ్యయభారం తగ్గి సులభతరం అవుతుంది. అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో ప్రజా సమస్యల పరిష్కారం సులువవుతుంది. భూముల విలువ పెరిగే అవకాశం ఉంటుంది. బస్సు రవాణా, రైల్వే స్టేషన్ సదుపాయాలు పూర్తి స్థాయిలో ప్రజలు వినియోగించుకుంటారు. వ్యాపారస్తుల క్రయవిక్రయాలు పెరుగుతాయి.

పది నెలలైనా డివిజన్ ఏదీ..?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పారు. తీరా ప్రభుత్వంలోకి వచ్చాక పట్టించుకోవడమే మానేశారు. ఓట్లు దండుకోవడం కోసమే మేనిఫెస్టో పొందుపరిచి ప్రజలను మోసం చేశారు. పది నెలలైనా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయకపోవడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనం. దీనిపై ప్రభుత్వ విప్ ఐలయ్య దృష్టి సారించాలి.

- మొరిగాడి వెంకటేశ్ గౌడ్, బీఆర్ఎస్ ఆలేరు పట్టణ మాజీ అధ్యక్షుడు

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..

అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితోపాటు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, బీర్ల అయిలయ్య రెవెన్యూ డివిజన్ చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారు. భువనగిరి డివిజన్‌లో 12 మండలాలు ఉండటంతో అన్ని విధాలుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆలేరును డివిజన్ చేస్తే ఈ సమస్యలు పరిష్కారమవుతాయి. ఆలేరు ఎంతో అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చవరకూ పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

- పసునూరి వీరేశం, ఆలేరు రెవెన్యూ డివిజన్ అఖిల పక్ష సాధన కమిటీ కన్వీనర్

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెంచికల్ పహాడ్ గ్రామ రైతులు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- అవార్డు సమావేశాన్ని బహిష్కరించిన రైతులు
- హాజరైన ఒక మహిళా రైతు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 28 : ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు అవార్డును ఇచ్చేందుకు ప్రభుత్వం భువనగిరి లోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం మంగళవారంతో నాలుగో రోజుకు చేరుకుంది. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న భువనగిరి మండలంలోని పెంచికల్ పహాడ్ గ్రామానికి చెందిన 52 మంది రైతుల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. అందుకు సంబంధించిన అవార్డును రైతులకు ఇచ్చేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. కానీ ఈ సమావేశాన్ని బాధిత రైతులు బహిష్కరించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కానీ ఆ గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సంధ్యారాణి అనే మహిళ తన పేరున గల రెండు గుంటల భూమి పత్రాలను ప్రభుత్వానికి ట్రిపుల్ ఆర్ కోసం ఇచ్చింది. ఈ అవార్డు సమావేశం బుధవారంతో ముగియనుంది.

హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

నల్లగొండ రూరల్,అక్టోబర్ 29: ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో సబ్ జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి.విమల పోటీలను ప్రారంభించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 2 నుంచి 4 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, పీఈటీలు పాల్గొన్నారు.

ఎంపికైన ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ బాలికల జట్టు

నవంబర్ 2 నుంచి గుట్టలో కార్తీక మాసోత్సవాలు

- రోజుకు ఆరు బ్యాచ్‌లుగా వ్రతాలు
- వివరాలు వెల్లడించిన ఈఓ భాస్కర్‌రావు

వివరాలు వెల్లడిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, అక్టోబర్29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్ రావు తెలిపారు. కొండపైన ఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ అన్నవరంగా పేరు పొందిన యాదగిరిగుట్ట క్షేత్రంలో కార్తీక మాసంలో అత్యధిక వ్రతాలు జరుగుతాయని, అందుకనుగుణంగా సకల ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొండ కింద వ్రత మండపంలో 6 బ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, 2వ బ్యాచ్ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, 3వ బ్యాచ్ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 4వ బ్యాచ్ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు, 5వ బ్యాచ్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు, 6వ బ్యాచ్ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా నవంబర్ 15న 8 బ్యాచ్‌ల్లో వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 5.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వ్రతాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. రూ. 800 రుసుముతో వ్రతానికి కావాల్సిన సామగ్రి ఆలయ అధికారులే సమకూర్చుతారని, అందుకనుగుణంగా వ్రత మండపాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వ్రత మండపం ప్రాంతంలో సీసీ రోడ్లు, పార్కింగ్ టైల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. వాహన పార్కింగ్‌ను తీసివేస్తున్నట్లు తెలిపారు. వాలెట్ పార్కింగ్‌ను తొలిసారిగా తీసుకొస్తున్నామన్నారు. వ్రత మండపం ప్రాంతంలో స్వామివారి ప్రసాద విక్రయశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్రత మండప ప్రాంతంలో చుట్టూ ఎల్ఈడీ స్క్రీన్లను ఉంచనున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ట్రై సైకిల్‌ను అందుబాటులో ఉంచామన్నారు. గత కార్తీకమాసంలో 18,203 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారని, ఈ సారి ఆ సంఖ్య మరింతగా పెరిగేందుకు కృషి చేస్తామని చెప్పారు. గతంలో మాదిరిగా ప్రత్యేక వ్రతాలు ఉండవని తెలిపారు. పాతగుట్ట ఆలయంలో 5 బ్యాచ్‌లుగా వత్రాలను నిర్వహిస్తామన్నారు.

దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీకమాసం సందర్భంగా దీపారాధన చేసే భక్తులకు ప్రత్యేకమైన స్టాళ్లను ఏర్పాటు చేశామని ఈఓ వెల్లడించారు. కొండపైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద, ఉత్తర రాజ గోపురం ఎదురుగా, కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద దీపారాధన చేసుకునే వెలుసుబాటు కల్పించామన్నారు. కొండకింద లక్ష్మీ పుష్కరిణి వద్ద, సత్యనారాయణస్వామి వ్రత మండపం, స్వామివారి వైకుంఠ ద్వారంతోపాటు పాతగుట్ట ఆలయం వద్ద దీపారాధన స్టాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

దీపావళి రోజున ఆలయ వేళల్లో మార్పులు

దీపావళి పర్వదినం పురస్కరించుకొని గురువారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఉదయం నిత్య కైంకర్యంలో స్వామివారి సుప్రభాత దర్శన టికెట్లను రద్దు చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 3.30 నుంచి 4.00 గంటల వరకు స్వామివారి సుప్రభాతం, 4.15 నుంచి 4.45 గంటల వరకు స్వామి, అమ్మవార్ల మంగళహారతులు, 4.45 నుంచి 6.30 గంటల వరకు తిరువారాధన, బాలభోగం ఆరగింపు, 6.30 నుంచి 7.30 గంటల వరకు స్వామివారికి నిజాభిషేకం, ఉదయం 7.30 గంటలకు సహస్రనామార్చన, సుదర్శన నారసింహ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8.15 గంటల నుంచి స్వామివారి సర్వ దర్శనాలను ప్రారంభిస్తామని చెప్పారు.